


ఆవును. వారంరోజులుగా పగలూ రాత్రీ అనక ఆయన తిరగడం-ఆయనవచ్చేటంతవరకూ కళ్ళల్లో జ్యోతులు వెలిగించుకుని - వచ్చిన ఆయన కళ్ళల్లోనే వెళ్ళినపని తేలిపోతూ కన్పిస్తూంటే, శారదకు "యేమయిం"దనే ప్రశ్న వెయ్యా నవసరం వుండేది కాదు.

కాని, యీరోజు 'యేమండీ' వెనుక కొండంత ఆదుర్దా, ఆవేదనా పలికిస్తూ పలకరించింది. ఎల్లుండి యీపాటికి కూతురు సుగుణ, పసుపుబట్టలతో పతీసమేతంగా తమదగ్గరకు దీవెనలకోసం వచ్చే శుభఘడియలు కళ్ళలో తేలి కన్పిస్తున్నాయి- ఇంటినిండా బంధువులు - అయినవాళ్ళు కాని వాళ్ళు వచ్చారు. దొడ్లో గాడిపొయ్యిమీద కాగే పులుసులోంచి ములక్కాడల వాసన - వుడుకుతున్న బియ్యం-వుద్రేకంగా - సముద్రపు నురగల్లా మూతలు తన్నుకు వస్తున్నాయి...."అమ్మా .... పచ్చడికి కొబ్బరికాయలు కావాలిట. ఆ గది తాళాలివ్వు" అంటూ వచ్చిన పెళ్ళికూతురు సుగుణ మౌనంగావున్న తల్లిదండ్రుల్ని చూసి మరేం మాట్లాడ లేకపోయింది. "చినబామ్మ దగ్గర వున్నాయ్" అంది కూతురువైపు చూడకుండానే తల్లి. సుగుణ వెళ్ళిపోయింది. వచ్చిన మాట్లాడిన, వేగంలేదు తిరిగి వెళ్లేటప్పుడు. "నాకేం తోచడంలేదు" అన్నాడు దీనంగా సుబ్బారావుగారు. "అలా అంటే యెలా అత్తయ్యని పిలవనా" అంది శారద తనకి యేం తోచకపోవడంతో.

తనేం చెయ్యగలడు? ఇప్పటికి ముగ్గురాడపిల్లల పెళ్ళి చేశాననిపించుకున్నాడు. 'ఫరవాలేదు. పెళ్ళిళ్ళు వున్నంతలో ఘనంగా చేశాడని' చెప్పుకున్నారు బంధువులు. 'స్తోమతకు మించిన సంబంధాలు తెచ్చాడు పాపం - వంటలు చాలా బావున్నాయ్' అన్నారు వూళ్లోమిత్రులు. ఎవరు యెలా అనుకున్నా సుబ్బారావుగారు మాత్రం పది జన్మల అనంతరంకూడా ఆడపిల్లల నివ్వద్దని దేవుణ్ని ప్రార్థించాడు.

ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళ తరువాత చూసుకుంటే తాతలనాటి రెండెకరాల పల్లపు భూమి, భార్యమెళ్లో కంటే, కాసులపేరు - తనఖానుంచి అమ్మకంలోకి జారిపోయాయి. ఇవన్నీ జరిగి ఐదేళ్ళుకూడా కాలేదు.

మూడేళ్ళక్రితం - సుగుణ కీరోజు పెళ్ళి చెయ్యాల్సివుంటుందని తెలిసినా-పెళ్ళి ఇంత కష్టతరమని, గుండెలమీద అగ్నిపర్వతం అవుతుందని గుర్తుకొచ్చినా, సుబ్బారావుగారు చాలా రకాలుగా సంపాదించేవాడు.

రెండేళ్ళనాడు కాంట్రాక్టర్ వీరయ్య పదివేలు తనచేతిలో పెడుతూంటే, ఆత్మాభిమానం, నిజాయితీ పేరన తిరస్కరించేవాడు కాదు. ఆఖరిపిల్ల సుగుణని దత్తత ఇమ్మని పిన్నత్తగారు వస్తే, లేమిని మెత్తిపొడుస్తోందని బాధపడేవాడూకాదు.

అసలు తనకి అనుమానా లెక్కువ.

బ్రతుకు కొందరినిజంటరూళ్ళమ్మట పొందికైన అక్షరాల్లా నడిపిస్తుంది. తన బ్రతుకంతా నలిగిన కాగితంమీద వొకటో క్లాసు కుర్రాడి వ్రాతలాగే గడిచిపోయింది. కారణాలు యెన్నో వున్నాయ్. పెంచినవాళ్ళు రక్తసంబంధీకులు, ఆప్తులు, ఆఖరికి రూమ్‌మేట్ అందరూ తను-తన్ని-నచ్చకుండావే ప్రభావం సంపాదించారు. తనకు వాళ్ళతప్ప నిజానికి యెవరూ తెలియనూ తెలియరు. ఎందుకో అంత అలసటలోనూ - మనోగ్లానిలోనూ అయనకు పద్మగుర్తుకువచ్చింది. తను బి. ఏ. ప్యాస్ అయినవారం తరువాత జరిగిన సంఘటన.

యథాలాపంగా అన్నగారితో కలసి బజారుకు వెళ్ళాడు. కాఫీ తాగి బయటకు వచ్చేలోపున యెవరో తెలియనివ్యక్తి వచ్చి అన్నయ్యతో నవ్వుతూ మాట్లాడి - ఆ తరువాత భుజాలు చరవడంవరకూ వెళాడు. మధ్య మధ్య తనని - నిలువుగా, వాలుగా చూడ్డం చేస్తున్నాడు. వాళ్ళ సంభాషణలు ఒక కొలిక్కిరాకపోవడంతో బయటకువెళ్ళి మిత్రులతో వుండిపోయాడు. కొంచెంసేపటికి అన్నయ్యా, ఆయనా బయటకువచ్చారు. "వెళతాను మరి. మా ఇంటికిరండి." అని అన్నయ్యతో అని "నువ్వూ రావోయ్" అన్నాడు తనతో.

ఎక్కడికో యెందుకో తనకి తెలియదు. అన్నయ్యతో బయలుదేరి వోయింటికి వెళ్ళాడు. అన్నగారూ,తనూ హాల్లో కూర్చున్నారు.

నలుగురైదుగురు ఆడవాళ్ళు తలుపుపక్కలనుంచి, కిటికీవారలోంచి చూడ్డం - వ్యర్థ ప్రయత్నంమీద ఆపుకుంటున్న మాటలు.

ఓ పదిహేనేళ్ళకుర్రాడు కాఫీలు తీసుకువచ్చి ఇచ్చాడు. మరో ముసలాయనవచ్చి కుశలప్రశ్నలు వేయడం మొదలుపెట్టాడు. ఈలోపునే పెద్దావిడ వో పదహారేళ్ళఅమ్మాయిని తీసుకువచ్చి హాల్లో చాపమీద కూర్చోపెట్టింది. అన్నయ్య ఆ అమ్మాయిని యేవో అడుగుతున్నాడు. హోటల్లో కన్పించినాయనకూడా వచ్చి కూర్చుని తిరిగి యెత్తూలావునుంచి చదువువరకూ రకరకాలుగా ప్రశ్నల పరంపరలు కురిపించాడు. అన్నయ్య ఆమెనిపేరేమిటని అడిగితే'పద్మ' అంది తలెత్తి తనవైపు చూస్తూ.

తను చూశాడు. పేరులాగేవుంది. రెండుకాళ్ళూ ముడుచుకుని కూర్చుంది. పువ్వుల సిల్కు పరికిణీ కాళ్ళమీదకు జరుపుకునే ప్రయత్నం చేస్తోంది. చెవులరింగులు ఆగిపోయేముందు ఫేన్‌లా కదులుతున్నాయి. మనసులో వుల్లాసాన్ని, మాటలప్రవాహాన్ని ఆపాలని వృథాప్రయత్నంచేసే చిన్నినోరు. పట్టుతడిలో సువాసనసూనెలోకలిసి-పక్కపాపిడిమధ్య వొత్తైనజుట్టు ముడతలు పడ్డ ముఖమల్‌లా వుంది. చూడగానే కన్పించే కాటుకపెట్టుకున్న పెద్దకళ్ళు. వాటిమధ్యనించిచూస్తున్న - అరిగిపోయిన బాణంమొనలాంటిముక్కు. కంఠంనుంచి కోపంగా రెండువైపులా విడిపోయి జారిన నునుపయిన భుజాలు గుండ్రనయిన చేతులుగాదిగిపోయాయి. మెళ్ళో వొకేవొక రెండుపేటల చంద్రహారం. సిల్కుకండువాలోంచి మెరిసే గుండెలభామాహూపం. చీరకట్టుకున్న శిల్పంలా వుంది.

బయటకు రాగానే 'యెలావుందిరా' అని అడిగాడు అన్నయ్య. తన కదంతా కలలో జరిగినట్టు యథార్థంకాని భ్రమలా వుంది.

తను ఇంతత్వరగా పెళ్ళిచేసుకోవల్సివుంటుందని - ఇలా వో అమ్మాయి తన ముందు కూర్చుని 'నీ భార్యగా -నాతో నీకు నచ్చిన అర్హతలు వెదుక్కో మంటుం'దని తెలియలేదు.

పెళ్ళిచూపులు.... మొదటకు యీ అనుభవం కొత్తదీ, రుచికరమయిందీ అయినా వూహించంది.తను కాదంటే,కాదు-ఇప్పుడు కాదంటే.—

పద్మ గుర్తుకొచ్చింది. ఇంటికి వచ్చిన తరువాత - అంతవరకూ వ్యతిరేకత ప్రదర్శించిన ఆలోచనలు-పరిమళాలుగా మారి- ఆ సువాసనలు యే పుష్పానివో తెలుసుకోవాలనే జిజ్ఞాసతో తిరగసాగాయి.

తను వుద్యోగం-భార్యా - పిల్లలూ-చిన్నయిల్లు-సాయంకాలం మెరీనాలో రోజూ చూసే జంటల్లో తామూ వో జంటగా మారడం. పక్కనున్న భార్యకు అర్థంకాంది- తనకే అర్థంకాని భాషలో చెబుతూ ఆమె వొత్తైన జుట్టులో దాగిన నక్షత్రాల నీడల్ని వెదకడం - కళ్ళవెనుక సముద్రపు ప్రతిబింబం-కాదు అలల యెత్తు కొలవడం. ఆలోచనలు చాలాదూరం చెదిరిపోతున్నాయి.

వదిన-తల్లి - అన్నయ్య - వొకటికి పదిసార్లు అడిగారు 'యెలావుంది అమ్మాయి' అని. వారందాటింది. అందరూ తిరిగి మామూలుగా వుంటున్నారు. అమ్మా-వదినా మాటల మధ్య పద్మగురించి తనని ప్రశ్నించాలని ప్రయత్నపూర్వకంగా వాళ్ళదగ్గరగా తిరిగేవాడు. వాళ్ళు యేగిన్నెల చప్పుడులోనో, కుంపటి విసరడంలోనో మునిగిపోయేవారు.

అద్దంలో ప్రతిబింబం
వయస్సుదా ? మనస్సుదా ?
తెలుసుకోవాలని వుందా ?

వచ్చే సంచికలో
భమిడిపాటి రామగోపాలంగారి

# అద్దం అబద్ధమాడింది..

చిన్న కథ చదవండి

ఆ రోజు పారీస్ కార్నర్ బస్‌స్టాప్‌లో తనవెనుక క్యూలో దూరంగా వుంది పద్మ. ఆమెవెనుక స్నేహితురాలై వుంటుంది - భుజంమీద చెయ్యేసి మాట్లాడుతోంది.

ఆ రోజు అందంగా కన్పించాలని ప్రయత్నపూర్వకంగా నెగ్గిన పద్మ - యిప్పుడు - అప్రయత్నంగా మరింత ఆకర్షణీయంగా వుంది. ఆరోజు అందం బుద్ధిమంతుకిలా తనముందు కూర్చున్నమూలంగా యీ ఆకర్షణ యేకళ్ళవెనుక తెల్ల తెరల్లోనో దాగి వుండి వుంటుంది.

మగవాళ్ళు గుర్తిస్తున్నారనుకునేటప్పుడు కంటే యథాలాపంగా వున్నప్పుడే స్త్రీలు అందంగా ఆకర్షిస్తారు. బస్‌స్టాప్ అని తెలిసినా తనకి మాట్లాడాలని అన్పించింది.

"మీరు" అన్నాడు అందుకే. ఆ అమ్మాయి గమనించలేదు. నిజానికి అప్పటికే వో సిటీబస్ వచ్చి ఖాళీలేదని చెప్పి వెళ్ళిపోవడంతో క్యూలో మనుష్యులందరూ నిరాశతో వంకరటింకరగా, గుంపులుగా విడిపోయారు. తనపిలుపు పద్మకు తప్పకుండా వినపడాలి.

"చూడండి"

"నిన్నేనే. ఆయనెవరో పిలుస్తున్నారు" అంది స్నేహితురాలు పద్మవైపు చరిచి.

"యెవరూ" అని ఇటుతిరిగి చూసింది. తనవైపునుంచి చూపుని అరక్షణంలో స్నేహితురాలిమీదకు తిప్పి "నాకు తెలియదు ఆయనెవరో. నన్నుకాదు" అంది గట్టిగా, కోపంగా.

కావాలని ప్రయత్నపూర్వకంగా ఆ మాట పద్మ అందని తనకు తెలుసు. పద్మవైపు జాలిగానో కోపంతోనో చూసినట్టు - శరీరంలో యౌవనంలో విశేషమున్న ఆ క్షణంలో ప్రవహించిన్నీ గుర్తులేదు. జీవితంలో-అదీ స్త్రీనోటివెంట అలాంటి మాటలు వినడం తనకు కొత్త. ఆ చూపులో కోతే కొత్త. మోసంచెయ్యడం -వ్యంగ్యంగా నవ్వడం, మాట్లాడం, పక్కబిగించి కన్ల. చిట్లించిచూడ్డం ఇలాంటి పనులు చేసేవాళ్ళంటే తనకుజాలి-అంతకుమించిన కోపం.

అయినా పద్మమాట-ఆమెనుంచి తన్ను తప్పించలేకపోయింది. తిరిగిచూశాడు. ఆమె చెప్పింది - మార్చుకుని కొత్తమాట అనాలనే ఆశతో.

బస్‌స్టాప్‌బోర్డు కిందనుంచుని తనవైపు చూస్తూ స్నేహితురాలితో ఏదో చెప్పి బిగ్గరగా నవ్వింది. చాలామంది ఆమెను చూశారు. అంతకు పూర్వంనుంచీ తమ ఇద్దర్నీ గమనిస్తున్నవాళ్ళేమో ఖైదీని చూసినట్టు చూశారు తనవైపు.

ఆనవ్వు తనలో అగ్నిపర్వతం రేపింది. అవమానప్రవాహమే తెచ్చింది. తీసుకువెళ్ళి అగాధాల లోయలో పడవేసింది.

అయినా మనిషిలో నిద్రపోయే మెతక భావం ఏదో వుంటుందేమో. అదే తనని ఆ పరిసరాలనించి దూరంగా తీసుకువెళ్ళింది. పద్మ నవ్వు వెంటాడుతూనే వుంది. నిద్రలో మెలకువలో-కలలో శతసహస్ర కంఠాలతో ధ్వనితరంగాలై తిరిగేది. ఎందుకో-పద్మతో పెళ్ళిగురించినమాటలు తిరిగి రేగుతాయేమోనని భయపడ్డాడు. ఆ నవ్వు గుర్తున్నంత కాలం, ప్రేమని జయించే ఆ నవ్వు- కాదు- ఆశను తనలోంచి బలంగా వేరుచేసిన ఆ నవ్వు-తను పద్మను పెళ్ళిచేసుకోగలడా.

కాలం తనపక్షానేవుంది. శారదకూ పద్మకూ పోలిక లేకపోవచ్చు. శారద తన భార్యగా ఇన్నియేళ్ళజీవితంలో పద్మ తలపు రానీకుండానే సంసారం సాగించింది. అప్పుడప్పుడు కలలోవలె కన్పించే పద్మగుర్తులు శారద తన నడకతో - మాటలతో మైమరపించేది.

వాలుకుర్చీలో పడుకున్న సుబ్బారావుగారి మెదడు ఆలోచనలనుంచి విశ్రాంతికి పయనించింది. నవ్వొచ్చింది చిన్నగా. ఎల్లుండి వుదయం కూతురుపెళ్ళి పెట్టుకుని-తను యెదుర్కోవలసిన సమస్యలు కొండలన్నివుండగా యీ గతతార్కికమేమిటి. బంధువులు, మగపెళ్ళివారు అందరూ వచ్చారు. పెళ్ళి పందిట్లో తను కట్నం యివ్వకపోతే యేంజరుగుతుంది. ఇంతవరకూచేసినప్రయత్నాలన్నీ వ్యర్థమౌతూనే వచ్చాయి. "క్షమించండి కట్నం త్వరలో సర్దుబాటుచేస్తా"నంటే సానుభూతిచూపే వాళ్ళ సంఖ్యకంటే నవ్వేవాళ్ళజాబితాఎక్కువుంటుంది. ఆ తరువాత సుగుణపెళ్ళి అవుతుందా? వియ్యంకుడు శేషగిరిరావుగారిని పెళ్ళిప్రాధేయపడితే? కన్నీళ్ళతో కాళ్ళయినా కడగాల్సిన సమయంయిది. వుహూ, ఆయన భార్యచేతిలో కీలుబొమ్మని చెప్పుకుంటారు. వియ్యపరాలు మహాగడసరి అని వుదయం నుంచీ శారద చెబుతూనేవుంది. ఆ అన్నట్టు వియ్యపురాలిపేరు పద్మావతిట. పద్మ!

ఆయనలో ఆలోచనలు తిరిగి కెరటాలు వేశాయి. ఆవిడ రూపంవచ్చి కళ్ళముందు నుంచుంది. సుబ్బారావుగారు వాలుకుర్చీలోంచి నడుంలేపి కూర్చున్నాడు.

అవును. అదేరూపం. కళ్ళలోకాంతి కొంచెం మబ్బులోకలిసింది. యవ్వనాన్ని జయించిన కౌమారం. అయినా అందం తాలూకు గుర్తులు శరీరం నలుమూలలా - గాయపడి గుర్తుకోసం బలవంతంగా వోపిక తెచ్చుకుని మూలిగేసైనికుడి ప్రయత్నాల్లా వున్నాయి. పద్మని వయసు పద్మావతిగా మార్చివేసినట్టుంది. బహుశా నలభైపైనే వుండచ్చు వయసు.

అయితే పద్మావతి తన్ను గుర్తుపట్టిందా. ఆయనకు కంగారుకలిగింది. ఏనాడో యెవరికీ అర్థంకాకుండా కారణాలు తెలియకుండా విడిపోయినమనిషి. మనసు వ్యతిరేకించిన రూపాన్ని భగవంతుడు బాంధవ్యంరూపంలో దగ్గరచేస్తున్నాడేమో. బహుశా ఆ పద్మ ఈ పద్మావతిగారు కాదేమో. అయితే?

"అలా కూర్చున్నావేరా భోంచెయ్యవా" తల్లి వచ్చింది.

"వాళ్ళంతా కూర్చున్నారు. మిమ్మల్ని అడుగుతున్నారు" వెనకవచ్చిన శారద అంది.

"అమ్మా! యింతకీ యేం చేద్దాం.... నాకేం తోచడంలేదు...."

"మా వియ్యపురాలు వచ్చింది.... మనసు ఆగింది కాదురా బాబూ....ఆవిడని చూస్తే -పార్వతీదేవిలా వుంది... నేనూ యిదీ కలిపి చేతులు పట్టుకుని గట్టెక్కించమని అడిగేశాం...". తన్ను మాట్లాడనివ్వలేదు శారద.

"రాజమహేంద్రవరం వెళ్ళిన మనిషి యింతవరకు రాలేదు... సమయానికి అందుతుంది, అందకపోతుంది..పీటలమీద గొడవ రాకుండా వుండడంకోసం...."

"మీకేమన్నా మతిపోయిందా...డబ్బు లేదని కాబోయే వియ్యపురాలిదగ్గర యేడ్చిపోయారా.."



"చావుండిరా..నువ్వేం మాట్లాడవాయే.. ఆడపీనుగులం మా దిగులు నీకేం తెలుస్తుంది..."

"వాళ్ళిప్పుడు పెళ్ళొద్దని లేచి చక్కాపోతే..యింతకన్నా చావు నయం.."

సుగుణ వచ్చింది యీ గందరగోళం లోకి..ఆ అమ్మాయి చూపులే - అడుగుల ధ్వనే ఆయన్ని ఆవేశంలోంచి వాస్తవం లోకి తెచ్చాయి.

" నాన్నా..పద్మావతమ్మగారు నిన్ను విడిదికి రమ్మని కబురుచేశారు.."

ఆయన తువ్వాలు భుజంమీద వేసుకుని-వో సారి భార్యనీ తల్లినీ చూసి బయటకు నడిచాడు.

గ్యాస్ లైట్ వెలుతురులో మామిడి తోరణాలు నిద్రరాక అలజడిచేస్తున్నాయి. పందిరి రాటల్ని కొబ్బరాకులు కౌగలించుకుని తాదాత్మ్యం పొందుతున్నాయి. అరుగుల మీదనుంచి సగం జారిన జంపఖానాలమీద





కుర్రాళ్ళు నిద్రపోతున్నారు. ఓ మూల అలంకారాలు తీసేసిన అతివలా పల్లకీ... వీధి గదితలుపులు వోరగా వేసి లోపల యెవరో పేకాట ఆడుకుంటున్నారు. సావడిలో ఆడవాళ్ళు చెల్లాచెదరయిన కదంబం దండల్లా నిద్రపోతున్నారు. పక్కన గది.

"రండి" అంది వియ్యపురాలు..మడత మంచంమీద కూర్చున్న చోటనుంచి మర్యాద చిహ్నంగా జరిగి కుర్చీ చూపిస్తూ.

ఆయన అందులో కూర్చున్నాడు.

"భోజనం చెయ్యకుండా వచ్చేశారేమిటి"

"లేదు.."

"అంటే భోజనం చెయ్యలేదనా..నా మాట కాదనా.?" పరకాయించి చూస్తున్నాడు సుబ్బారావుగారు.

ఎర్రరంగు చీరలో ప్రకృతికి భయపడి పారిపోయి వచ్చి దాగిన సంధ్యాదేవిలా వుంది పద్మావతి. తెల్లటి గ్లాస్కో రవిక జబ్బలమీద వయసు చేసిన యెత్తు పల్లాల్ని దాచలేకపోతోంది. తలలో వెన్నెల్ని మింగాలని ప్రవేశించిన మబ్బురేకల్లా అక్కడక్కడ నల్ల వెంట్రుకలు. పల్చబడి జారిన చెవులకు యెర్రటి యేడు పోళ్ళ దుద్దులు... చెమటతో తడిసినమూలంగా దశమిచంద్రుడిలాంటి బొట్టు...

"ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యడంలో చాలా యిబ్బందులు వున్నాయి. మా పిల్లల పెళ్ళిళ్ళకి - యిన్ని అవస్థలూ మేమూ పడ్డాం.." ఎందు కివన్నీ చెబుతుంది యీావిడ...

"విడిది కొంచెం యిరుకు గానీ బాగానే వుంది. సాయంకాలం గాలి చూసి వర్షం వస్తుందేమోనని భయపడ్డాను, నాకు వర్షం అంటే భయం."

"పెళ్ళిళ్ళరోజుల్లో వర్షం వస్తే యెంత చేస్తే రాణింపు వుంటుంది?. మీకు అన్ని సదుపాయాలు నచ్చుబాటుగా వున్నాయాండి?." సుబ్బారావు అన్నాడు.

ఆవిడ అంది.." దానికేమిటిలెండి. మీ వాళ్ళంతా బాగా కంజాయింపు తెలిసిన మనుష్యులు. యెంత అందంగా వుంటారో మనసూ అంత నిర్మలంగానూ అనిపిస్తుంది మాటలు వింటూాంటే..." ఆగి అంది.

"మా కోడలు బాగానే వుంది. పెళ్లిచూపులరోజున యేమో అనుకున్నాను..ఆడపిల్లకి తండ్రిపోలిక రావడం అదృష్టం అంటారు" క్షణం ఆగి, "అదేమిటి మాట్లాడరేం" అని-తిరిగి "నేను గుర్తువున్నానా" అంది గమ్మున.

నిశితంగా చూస్తున్న సుబ్బారావుగారు "మీరూ" అన్నాడు.

అవును. ఆ శరీరంమీదనుంచి పాతిక సంవత్సరాల్ని - అనుభవాల్ని - తొలగించి చూస్తే వాటికింద - ఆరోజు తనముందు చాపమీద కాళ్ళు ముడుచుకొని కూర్చున్న పద్మ కన్పిస్తోంది.

తనా వయసులోకి వెళ్ళలేకపోతున్నాడు. వెళ్లకూడదనుకున్నాడు గట్టిగా లోపల ..తెలుసునని చెబితే యిద్దరికీ నష్టంలేదు. వో వయసులో భయాలు వార్ధక్యంలో స్వేచ్ఛని పొందుతాయి. అయినా తనిప్పుడా పరిస్థితిలో లేడు. అందుకే నెమ్మదిగా "గుర్తు రావడంలేదు" అన్నాడు.

"పద్మని" అంది పద్మావతిగా మారిన పద్మ.

"నేను మిమ్మల్ని గుర్తు పట్టలేక పోయాను." అబద్ధం ఆడడం అవసరం అనిపించింది.

"పోనీలెండి..నేను గుర్తుచేస్తే జ్ఞాపకం వచ్చానా"

"వూ"

"శారదాంబ చాలా బావుంటుంది... చిన్నప్పుడు యింకా బావుండివుండాలికదూ" అంది దూరంగా యెవరికీ చెప్తోన్నట్టు... వెంటనే చూపు కిటికీ వైపు తిప్పి.

శారదాంబ..శారదను తనిన్ని రోజులుగా





ఆ పేరుతో వూహించి చూడలేదు. నవ్వొచ్చింది- అలా పిలవాలని హెచ్చరికలా వుంది.

వయసుముదిరిన గోదుమవన్నెతాచు-చుట్టుకుని పడుకున్నట్టుగా వుంది సిగ. ఆ సిగలో మల్లెలూ కనకాంబరాలూ కలిసిన దండ,

"ఇలా కూర్చుంటే చిన్నప్పటి రోజులు గుర్తొస్తున్నాయి. మీరు మద్రాసునుంచీ వెంటనే వచ్చేశారా"

రెండు ప్రశ్నలమధ్యా అగాధాల తేడా వుంది. ప్రళయం పుట్టే సముద్రంలోంచి ప్రశాంతమయిన లోయలోకి - ప్రవాహం దూకినప్పుడు కలిగే అలసటలోని ఆనందపు నిట్టూర్పు—ఆకాశంనుంచి అప్రయత్నంగా కాలుజారిన నక్షత్రం ఆ క్రిందను రెండింటినీ సోకే స్వరంతో ఆవిడ మేళవించింది.

"అప్పుడే వచ్చేశాను" అన్నాడు. ఆవిడ మాటల ప్రభావం తన మెదడుమీద తెచ్చిన పరిణామాన్ని తెలుసుకోలేక శరీరం చిన్నరకం వణకను తింటోంది.

" మిమ్మల్నెందుకు కబురుపంపించానో చెప్పలేదు. ఇప్పుడే వస్తాను" లోపలికి వెళ్ళి - వెళ్ళినంత త్వరగా వచ్చింది. చేతిలో చిన్నసైజు బేగ్ వుంది.

"ఇది శారదాంబగారికి యివ్వండి. కాదు లెండి తెరిచి చూడండి. దారిలోమాత్రం తెరిచేరు సుమా. నన్ను చంపుకు తిన్నట్టే మరి"

"అసలేమిటి యిది...."

"మిఠాయి" అంది నవ్వుతూ. ఆ నవ్వులో చిలిపితనంలేదు. సాదాగా నవ్వింది." దారిలో చూడరుగా. వస్తేనా"

"మరి వుంటాను."

అసలైన కథ కావాలా ?

నిజమైన కళ కావాలా ?

వచ్చేనెల "జ్యోతి" లో

కొడవటిగంటి కుటుంబరావుగారి

అందమైన పెద్ద కథ

కురూపి

చ ద వ ం డి

కథ వెల (మిగతా సంచికతోపాటు) 60 న. పై. మాత్రమే

"అదేమిటి — వుంటానని చెప్పి వెళ్ళిపోతున్నారు. ఆ. నాకు జవాబు చెప్పేరు కాదేం."

ఆలోచనగా చూశాడాయన. ఆవిడలో భావం దొరకని నవ్వు. పాతికేళ్ళక్రితం నవ్విన నవ్వులాంటిది అనిపించని నవ్వు-మంచినవ్వు-వెన్నెలలాంటి నవ్వు.

"అదే. శారదాంబగారు చిన్నప్పుడు యెలా వుండేవారో" ఆయనకు మాటలు దొరకలేదు. చేతిలో అనూహ్యమైన రహస్యాన్ని దాచుకున్న సంచీ. శరీరాన్ని ప్రశ్నార్ధకాలతో, ఆశ్చర్యార్ధకాలతో స్నానం చేయించే నవ్వు. ఆయనకీ నవ్వొచ్చింది.

"రేపు దాన్నే అడగండి" అన్నాడు బయటకు నడుస్తూ.

"చాల్లెండి." అంది వెనుక నవ్వుతూ పద్మావతి.

గదిలోకి ఆత్రుతగా వెళ్ళాడు. సంచీ తెరిచాడు. వూహించలేనిదీ - ఆలోచించలేనిదీ చూశాడు. ఆ క్షణంలో భగవంతుడి దర్శనమయినా ఆశ్చర్యపడడేమో ఆయన.

మనిషి భగవంతుణ్నే మించిపోతాడని కథల్లో చదివినప్పుడు అబద్ధానికి నవ్వుకున్నా - యీ రోజు ఆ సత్యం - యీ విధంగా ప్రాణంపోసుకుని యెదురవుతూంటే నిజమే అనిపిస్తోంది. అందులో వున్నది డబ్బు. బహుశా రెండువేలుండచ్చు. సుగుణ పెళ్ళికి తనివ్వవలసిన కట్నం. బయట అడుగుల చప్పుడు విన్పిస్తోంది. శారదేమో. పద్మావతి మాటలు గుర్తుకొచ్చి నవ్వుకున్నాడు. శారదను తనెందుకు పిలవలేదు. యే రహస్యం యిందులో వుంటుందని తను భయపడ్డాడు?

నిజానికి పద్మావతికూడా మనస్ఫూర్తిగా ఆ మాట అనుండదని దారిపొడుగునా చర్చిస్తూనే వచ్చాడు. "భార్యకుకూడా చూపకండేం" అనే మాటల్లో "రహస్యం మీ రొక్కరే చూడాలి సుమా" అనే ధ్వని కల్పించుకున్నాడు దారిలో.

"దేనికండి-ఆవిడ కబురు పంపుతా."

డబ్బును దాచిపెడుతూ అన్నాడు ఆయన. "పట్టినే యేదో ఆవిడా, భర్తా కబుర్లు చెబుతూ కూర్చోపెట్టారు"

"బాగా మాట్లాడిందా ఆవిడ"

"ఏం నన్ను తిట్టి పోస్తుందనుకున్నావా" అంతలోనే ఆయన స్వరంలో గర్వం తలెత్తింది. అది ప్రేమించిన మగవాడు. ప్రేమించబడ్డ పురుషుడు ఆ ప్రేమగురించి ఉన్నత వూహల్లో వూరేగేటప్పుడు కలుగుతుంది. స్త్రీ తలపు తీయని గుర్తులు - ఆడది గుర్తుచేసినప్పుడు గుండెల పొదుల్లో పూసిన గుమ్మడి పూలశోభ అది.

పెళ్ళయిన వారం తరవాత శారద భర్తకు భోజనంలోకి పెరుగు వడ్డిస్తూ అడిగింది.

"వో సంగతి అడుగుతాను నిజం చెబుతారా"

"వూ"

"వియ్యపురాల్ని చిన్నప్పుడు మీకిస్తామన్నారుటగా"

"వూ"అన్నీ తలెత్తి "నీకెవరు చెప్పారు" అన్నాడు,

మనుగుడుపుల రోజుల్లో ఆవిడే మాటల్లో చెప్పింది.

"వుహూ?"

"మరెందుకు చేసుకోలేదు."

"అది ఆవిడ చెప్పలేదేమిటి"

"చెప్పింది. మీరు మొదట కట్నం దగ్గర పేచీపెట్టి - దానికీ వాళ్ళు సరేనంటే-తిరిగి మీకు ఆవిడ నచ్చలేదన్నారుటగా"

"యేమిటీ" కొత్తగా అడిగాడు. ఆవిడ తిరిగి చెప్పింది.

"నేను నచ్చలేదన్నానా"

"అవును. కొంచెం బొంగురు కంఠం అనీ. మెల్లకన్ననీ - యేవో లేని వొంకలు పెట్టారుటగా. అయినా తెలియక అడుగుతానూ" నవ్వేసి తిరిగి ఆపుకుంటూ, "ఆవిడకేమండీ యీ వయసులోనే బావుంది. చిన్నప్పుడు మరీ బావుండి వుంటుంది. అయినా మీరుపెద్దబాగున్నట్టు. పెళ్ళిరోజుల్లో సన్నగా నల్లగా వుండేవారు. అందరూ నన్నేడిపించుకు తినేవారు తెలుసా" అంది శారదాంబ. గతంలోకి వెళ్ళి తిరిగి వాస్తవంలోకి నవ్వుతూ వచ్చి, "కొంచెం పెరుగు వడ్డించేదా" అంది.

ఆయన వాస్తవంలోంచి వూహలోకి, వూహలోంచి గతంలోకి ప్రయాణం చేశాడు. ఏరోజూ యీ సంఘటన జరిగిన గుర్తులేదు. మరి పద్మావతి యెందుకనివుంటుంది.

పద్మ తనని చూసి నవ్వినరోజు ముందు-వారంక్రితం - అన్నయ్య వాళ్ళ గుమ్మంలో కన్పిస్తూ వుండేవాడు. ఆ క్రితంరోజు వరకూ పెళ్ళిప్రస్తావన తెచ్చే అన్నయ్య అప్పటి నుంచీ మౌనం వహించాడు. పద్మావతి బాగుండకపోవడం, మెల్లకన్ను. యివన్నీ యెలా సృష్టిజరిగాయో ఆలోచించేకన్నా ఆరోజు బస్‌స్టాప్‌లో పద్మ నవ్వును గుర్తు చేసుకుంటోంది- మెదడు. పాపం పద్మ నవ్వడంలో తప్పులేదు అనుకున్నాడు ఆఖరిసారిగా,

నవ్వుకు కారణం యిన్ని సంవత్సరాల తరువాత అర్ధమయిన-విలువయిన -క్షణంలో ఆయన పొందనిదానికి సహజమైన నిట్టూర్పు - ఆ తరువాత యేదో అర్ధమయినట్టుగా వేదాంతలీల ఛాయగా మెదుల్తూ పెదాల మధ్య వింతభావాల హాసరేఖ పుట్టాయి.

శారద చీర కుచ్చెళ్లు అటూ యిటూ కదుల్తున్నాయి. కాదు పద్మావతి అన్న శారదాంబగారి చీర కుచ్చెళ్లు. ఈసారి పైకి నవ్వాడు. శారదాంబగారు అర్ధమవక భర్తకేసి చూసింది. ●

